AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

నగరంలో ఆలయాల మూసివేత







నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

## రేపు ఎస్‌జీఎఫ్ వార్షిక సమావేశం

**అక్షరటుడే, ఇందూరు:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వార్షిక సమావేశం సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్లో నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగమణి తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. కాబట్టి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు. సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, డీసీఈబీ కార్యదర్శి సీతయ్య హాజరవుతారని పేర్కొన్నారు.



## గుత్ప, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి లిఫ్ట్‌లను ప్రారంభించాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** గుత్ప, చౌట్‌పల్లి హన్మంత్ రెడ్డి లిఫ్ట్‌లను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులకు సూచించారు. వేల్పూర్‌లోని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నివాసంలో ఆయనను కుకునూర్ గ్రామాభివృద్ధి కమిటీ, నవాబ్ లిఫ్ట్ కమిటీ సభ్యులు ఆదివారం కలిశారు. లిఫ్ట్ ప్రారంభించి చెరువులు నింపేందుకు అడ్డుగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ శాఖ సీఈ మధుసూదన్, ఈఈ భాను ప్రకాష్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. సీజన్ ప్రారభించకముందే మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధంగా ఉన్నాయా లేదా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లను తెప్పించి నవాబ్ లిఫ్ట్ ప్రారంభించాలని, కుకునూర్ లిఫ్ట్‌లో మోటార్లు ఇసుకలో కూరుకుపోయాయని వాటిని సైతం తీయించి పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్‌లో 45 టీఎంసీలు ఉన్నప్పుడే చెరువులు నింపి ఉంటే ఇప్పుడు ఈ సమస్య వచ్చేది కాదన్నారు. మెయింటెనెన్స్ లేక వెంగంటి లిఫ్ట్ సంబంధించిన కాపర్ కాయిల్స్, ఇతర లిఫ్ట్ సామగ్రి ఎత్తుకుపోయారని వాటిని రీస్టోర్ చేసి పల్లికొండ లిఫ్ట్ కుడా ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## వ్యవసాయాన్ని భ్రష్టు పట్టిస్తున్న రేవంత్ సర్కార్

**అక్షరటుడే, ఆర్మూర్:** ఓట్ల కోసం ఇష్టారీతిన హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ వ్యవసాయాన్ని భ్రష్టు పట్టిస్తోందని, ఉద్దేశపూర్వకంగానే యూరియా కొరత సృష్టించి అన్నదాత మెడకు ఉరి బిగించిందన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రైతులు ఎరువుల కోసం క్యూలు కడుతున్న దృశ్యాలే కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. ఎరువులు ఇవ్వడం చేతకాకపోతే సీఎం రేవంత్ రాజీనామా చేయాలన్నారు. కేసీఆర్ హయాంలో ఎరువుల దుకాణాల వద్ద ఎప్పుడైనా పోలీసులు కనిపించారా అని ప్రశ్నించారు. వాళ్ల పార్టీ మంత్రులే యూరియా లేదంటుంటే, రేవంత్ మాత్రం సరిపడా ఉందని అబద్ధం చెపుతున్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్‌ను తిట్టుడు తప్ప కాంగ్రెస్‌కు వేరే పనే లేదన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎట్లుంది? నేడు ఎట్లుంది? అని ప్రశ్నించారు. స్వర్ణయుగం పోయి మళ్లీ రాతియుగం వచ్చిందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.




# రవాణా శాఖ చెక్‌పోస్టుల ఎత్తివేత

రవాణా శాఖ చెక్‌పోస్టుల్లో అవినీతి గురించి అందరికి తెలిసిందే. అధికారులు ఏజెంట్ల సాయంతో లారీలు, ఇతర వాహనాల డ్రైవర్ల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తారని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఏసీబీ అధికారులు దాడులు చేపట్టగా.. చెక్ పోస్టుల్లో అధికారులు వాహనదారుల నుంచి డబ్బులు తీసుకుంటున్నట్లు తేలింది. దీంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రవాణా శాఖ చెక్‌పోస్టుల్లో అవినీతిని అంతం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను తొలగిస్తున్నట్లు ఆగస్టు 29న ఉత్తర్వులు జారీ చేసింది. - అక్షరటుడే, ఇందూరు

- ఉమ్మడి జిల్లాలో మూడింటిని తొలగిస్తూ నిర్ణయం
- ఇకపై రోడ్లపైనే వాహన తనిఖీలు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రవాణా శాఖ ఆధ్వర్యంలో మూడు చెక్ పోస్టులున్నాయి. నిజామాబాద్ జిల్లాలో సాలూర, కామారెడ్డి జిల్లాలో సలాబత్‌పూర్, పొందుర్తిలో ఆర్టీఏ చెక్‌పోస్టులు ఉన్నాయి. వీటిలో ఎంవీఐ, ఏఎంవీఐ, కానిస్టేబుల్ సిబ్బంది 24 గంటల పాటు షిఫ్టులవారీగా విధులు నిర్వహిస్తారు. అయితే ఇక్కడ అందే సేవలన్నీ ఇకపై ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు అనుగుణంగా రవాణా శాఖ సర్వర్‌లో మార్పులు చేస్తున్నారు. దీంతో అంతర్రాష్ట్ర వాహనాలకు సంబంధించిన తాత్కాలిక అనుమతులు, వాహన పన్నులు, రవాణా శాఖ నిబంధనల పత్రాలు తనిఖీలను సాధారణ తనిఖీల మాదిరిగానే చేపట్టనున్నారు.

### మొబైల్ స్క్వాడ్‌లు

చెక్‌పోస్టులను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఇకపై వాహనాలను రోడ్లపై తనిఖీ చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం ఆరు నెలల పాటు మొబైల్ స్క్వాడ్లను నియమించనుంది. ఆయా బృందాలు నూతన నిబంధనలపై అవగాహన కల్పించనున్నాయి. నిబంధనలు పాటించని వాహనదారులను గుర్తించేందుకు వీలుగా రహదారులపై ఆటో నంబర్ ప్లేట్ రీడర్ (ఏఎన్పీఆర్) కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

### ఇప్పటి వరకు చెక్ పోస్టుల విధులు

ఉమ్మడి జిల్లాలోకి ఎక్కువగా మహారాష్ట్ర, కర్ణాటక సరుకు రవాణాతో పాటు ప్రజలను తరలించే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రధానంగా జాతీయ రహదారి ఉండడంతో ఆయా రాష్ట్రాల సరుకు రవాణా వాహనాలు కూడా వెళ్తుంటాయి. వీటికి చెక్‌పోస్టుల వద్ద రవాణా అధికారులు తాత్కాలిక అనుమతి (టెంపరరీ పర్మిట్) పత్రాలని జారీ చేసేవారు. సరుకు ఏముంది, లోడ్ ఎంత ఉందనే వివరాలతో పాటు పన్నులు సక్రమంగా చెల్లించాలని తనిఖీలు చేసేవారు. నిబంధనలు పాటించకుండా పట్టుపడితే కేసులు నమోదు చేసేవారు.


### అక్రమాలకు ఆస్కారం

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల తొలగింపుతో వాహన రాకపోకల సులభతరం అవుతాయి. వస్తు రవాణా వేగవంతమై వ్యాపారులకు ఖర్చు, సమయం ఆదా అవుతుంది. ప్రభుత్వానికి చెక్ పోస్టుల నిర్వహణ ఖర్చు తగ్గుతుంది. కానీ నిషేధిత వస్తువులు, డ్రగ్స్, మాదకద్రవ్యాలు, మద్యం రవాణా పెరిగే ప్రమాదం ఉంది. సరుకు రవాణాలో అక్రమాలకు ఆస్కారం ఉంటుంది. పన్నులు చెల్లించకపోవడం, పర్మిట్లు తీసుకోకపోవడం వంటి వాటితో ప్రభుత్వానికి గండిపడే అవకాశం ఉంటుంది.

### అవినీతికి అడ్డుకట్ట


ఉమ్మడి జిల్లాలో రవాణా చెక్‌పోస్టుల నుంచి ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తుంది. అంతకన్నా ఎక్కువగా అక్కడ విధులు నిర్వర్తించే కొంతమంది సిబ్బంది వసూలు చేస్తారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు ఉదాహరణ ఇటీవల ఏసీబీ తనిఖీల్లోనే అనేక అక్రమాలు వెలుగు చూశాయి. చెక్‌పోస్ట్‌లో పోస్టింగ్ కోసం అధికారులు, కానిస్టేబుళ్లు ఉత్సాహం చూపుతుంటారు. ఒకరోజు విధులు నిర్వహిస్తే మరుసటి రోజు సెలవుతో పాటు మాముళ్లకు కొదవ లేకుండా ఉంటుంది. చెక్‌పోస్టు సిబ్బంది వసూళ్ల దందా అంతా ప్రైవేటు సిబ్బందితోనే నడిపేవారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇలాంటి వాటికి అడ్డుకట్ట పడనుంది.

### ఇకపై రహదారులపై తనిఖీలు



జిల్లాలోని చెక్‌పోస్టులను తొలగిస్తున్నట్లు రవాణా శాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. చెక్‌పోస్టుల్లో అందించే సేవలు ఇక నుంచి ఆన్‌లైన్‌లో అందిస్తాం. రోడ్లపైనే వాహనాల తనిఖీలు చేపడుతాం.

– ఉమామహేశ్వర్ రావు, డీటీవో



## సిర్నాపల్లిలో పర్యాటకుల సందడి

మండలంలోని సిర్నాపల్లిలో గల జానకీ బాయి చెరువు అలుగు పారుతోంది. జలపాతాన్ని తలపించేలా అలుగు పారుతుండటంతో పర్యాటకులు తిలకించడానికి భారీగా తరలి వస్తున్నారు. ఆదివారం కావడంతో సిర్నాపల్లి జలపాతం వద్ద పర్యాటలకు సందడి నెలకొంది. పచ్చని అడవి మధ్యలో జలపాతం అందాలను తిలకించిన పర్యాటకులు, అక్కడే వంటలు చేసుకొని వన భోజనాలు చేశారు. – అక్షరటుడే, ఇందల్వాయి

## గణేశ్ ఉత్సవాలకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు : సీపీ సాయి చైతన్య



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణేశ్ ఉత్సవాలకు సహకరించిన ప్రజలకు సీపీ సాయి చైతన్య కృతజ్ఞతలు తెలిపారు. వినాయక నిమజ్జనం ముగిసిన అనంతరం ఆయన ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జన ఉత్సవాల వరకు ప్రజలు సహకరించారన్నారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకున్నారని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో దాదాపు ఆరు వేల విగ్రహాలు ప్రతిష్ఠించినట్లు ఆయన తెలిపారు. గణేశ్ నిమజ్జనం సదర్భంగా ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ వివరించారు. బాసర, ఉమ్మెడతో పాటు మిగతా ప్రాంతాల్లో సైతం నిమజ్జనం కోసం పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. నగరంలో సార్వజనిక్ గణేశ్ మండలి, గణేశ్ మండపాల నిర్వాహకుల సహకారంతో ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉన్న ఆయా శాఖల అధికారులను ఆయన అభినందించారు.

## బీసీ డిక్లరేషన్ సభాస్థలిని పరిశీలించిన మంత్రుల బృందం



**అక్షరటుడే, కామారెడ్డి:** బీసీ డిక్లరేషన్ అమలు సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తమైంది. ఈనెల 15న కామారెడ్డి పట్టణంలో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రానికి ఐదుగురు మంత్రుల బృందం చేరుకుంది. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, వాకాటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షెట్కార్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం, డిగ్రీ కళాశాల మైదానాలను పరిశీలించారు. ముందుగా ఇందిరాగాంధీ స్టేడియాన్ని పరిశీలించారు. లక్ష మందితో సభ నిర్వహించాలని ప్లాన్ చేయడంతో జనాలకు స్టేడియం సరిపోదని భావించారు. దాంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని మంత్రుల బృందం పరిశీలించింది. జనాలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసేందుకు కళాశాల మైదానం అనువుగా ఉంటుందని నిర్ణయించారు.

## నగరంలో శ్రీప్రభు పల్లకీ సేవ



**అక్షరటుడే,ఇందూరు:** నగరంలోని వినాయక్‌నగర్‌లోని వినాయక కల్యాణ మండపంలో ఓమౌజయ ఏకోపాసన మహాధర్మం సంస్థ ఆధ్వర్యంలో స్వయంభు సద్గురు పరబ్రహ్మ శ్రీ ప్రభు పల్లకీసేవ నిర్వహించారు. భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పరబ్రహ్మ హోమం, పురవీధుల్లో చైతన్య శక్తి పీఠం శోభాయాత్ర నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ప్రజ్ఞానంద స్వామిజీ, పరమోజీ త్రిగుణాత్మక సిద్ధ పాల్గొన్నారు.

## ఘనంగా జెండా జాతర

**అక్షరటుడే, ఇందూరు :** నగరంలోని జెండా బాలజీ ఆలయంలో 15 రోజులుగా కొనసాగిన జాతర ఆదివారం ముగిసింది. వంశపారంపర్య అర్చకులు అజయ్ సంగ్వాయి, సంజయ్ సంగ్వాయి, విజయ్ సంగ్వాయ్ నేతృత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి రోజు సాయంత్రం జెండాతో పాటు ఉత్సవమూర్తులను శోభాయాత్రగా పూలాంగ్ సమీపంలోకి తరలించడం ఆనవాయితీ. కాగా ఈ సారి చంద్రగ్రహణం ఉండడంతో ఉదయాన్నే జెండాను ఊరేగించారు. ఆలయం నుంచి సిర్నాపల్లి గడి, గోల్ హనుమాన్ మీదుగా జెండాను తీసుకెళ్లి పూలాంగ్ బ్రిడ్జి సమీపంలో ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా, ఆలయ ఛైర్మన్ ప్రమోద్, ఈవో వేణు తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జెండా జాతరలో పాల్గొన్నారు. బాలాజీ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జెండాను దర్శించుకున్నారు. సంప్రదాయంగా వస్తున్న జాతరలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం ఆలయ పండితులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం ఇచ్చారు.



జెండాకు పూజలు చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్



జెండా ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్

## బీసీ రిజర్వేషన్లు అమలయ్యాకే స్థానిక ఎన్నికలకు వెళ్తాం: పీసీసీ చీఫ్

**అక్షరటుడే, కామారెడ్డి:** బీసీ రిజర్వేషన్లు అమలయ్యాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామని పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బీసీ బిల్లు ఆమోదంపై బీజేపీ నేతల భాగోతాన్ని బయటపెట్టేందుకే కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ అమలు సభ నిర్వహిస్తున్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని శుభం కన్వెన్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాహుల్ గాంధీ ఈదేశ భవిష్యత్తు అని తెలిపారు. ఈ దేశ జనాభాలో ఏ వర్గం ఎంత శాతం ఉంటారో అంతే శాతం ఫలాలు వారికి అందాలని రాహుల్ గాంధీ చెప్పారన్నారు. ఇప్పుడు ఇదే విధానంపై దేశమంతా ఉద్యమం నడుస్తుందని ఆ ఉద్యమానికి ఊపిరి పోసింది సీఎం రేవంత్ రెడ్డి అని తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కామారెడ్డి వేదికగా బీసీ డిక్లరేషన్ చేసింది కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. బీసీ బిల్లు చట్టం కాకుండా బీజేపీ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బీసీ బిల్లును అడ్డుకుంటున్న నాయకుల భరతం పట్టడానికి, వారి బాగోతం బయట పెట్టడానికే కామారెడ్డి సభ నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ నాయకులంటే దేవుడి పేరుతో ఓట్లడుక్కునే బిచ్చగాళ్లని తాను గతంలోనే చెప్పినట్టు గుర్తు చేశారు. తాము కూడా పూజలు చేస్తామని, ఏనాడు దేవుని పేరుతో



ఓట్లడగలేదన్నారు. బండి సంజయ్, అర్వింద్, ఈటల రాజేందర్ బీసీ బిల్లు ఆమోదం కోసం ఎందుకు ప్రయత్నించడం లేదన్నారు. జిల్లాకు కోడలిగా కవితను అభిమానిస్తామని, కాని లిక్కర్‌రాణిగా జిల్లాకు ఆమె చెడ్డపేరు తెచ్చారని పీసీసీ చీఫ్ పేర్కొన్నారు. కవిత స్వయంగా బీఆర్ఎస్ అవినీతిని చెప్తుంటే ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి మాట్లాడారు. ఈ నెల 15న పట్టణంలో నిర్వహించే బీసీ సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, మదన్ మోహన్ రావు, లక్ష్మీకాంతా రావు, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తాహెర్ బిన్ హందాన్, కాసుల బాలరాజు, కేశ వేణు తదితరులు పాల్గొన్నారు.



## బషీరాబాద్‌లో సఖ్యత సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి :** మండలంలోని బషీరాబాద్‌లో ఆదివారం సఖ్యత సంఘం భవనానికి భూమి పూజ చేశారు. మండల కేంద్రంలో రూ.10 లక్షల నిధులతో సఖ్యత సంఘ భవనానికి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాలపు నర్సయ్య, వైస్ ఛైర్మన్ సుంకేట బుచ్చన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడగల ప్రవీణ్, నూకల బుచ్చి మల్లయ్య, డాక్టర్ మురళి, నర్రా భూమేష్, వెన్నెల దేవేందర్, కస్తూరి శ్రీనివాస్, తోపారం శ్రీనివాస్, నారాయణ, సుమన్, మహేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**అక్షరటుడే, భీమ్‌గల్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొదిరే స్వామి అన్నారు. భీమ్‌గల్ మండలం గోనుగొప్పుల గ్రామంలో గ్రామస్థాయి కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అమలు తీరును ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందుతున్న వారి జాబితాను తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి భోజా గౌడ్, బాల్కొండ నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షుడు సేపూర్ చరణ్ గౌడ్, సొసైటీ ఛైర్మన్ దేవేందర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు అందజేత

**అక్షరటుడే,ముప్కాల్:** మండలంలోని రెంజర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఆదివారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. రెండో విడతలో 16మంది లబ్ధిదారులకు మంజూరైన ప్రొసీడింగ్ కాపీలను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉద్యోగ విరమణ కార్యక్రమం



**అక్షరటుడే, ఆర్మూర్ :** మిర్ధాపల్లి ఉన్నత పాఠశాల పీజీ హెచ్ఎంగా పనిచేసిన కుంట శ్రీనివాస్ రెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆదివారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామడిపల్లి రెడ్డి పంక్షన్ హాల్‌లో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. డీసీసీబీ కార్యదర్శి సీతయ్య, ఆలూర్ ఎంఈవో నరేందర్, పీఆర్టీయూ నాయకులు జలంధర్, తిరునగరి ప్రసాద్, గోపాల్, బీజేపీ నాయకులు లోక భూపతి రెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, కోటపాటి నరసింహ నాయుడు, బద్దం లింగారెడ్డి, వెంకట్ నర్సయ్య, పుష్పాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో వైద్య శిబిరం




**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని పోల్కంపేటలో రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇటీవల భారీ వర్షాలతో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, తహశీల్దార్ సురేష్, ఎంపీడీవో నరేష్ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని బతుకమ్మ కుంటను పరిశీలించారు. ఇటీవల వర్షాలకు పూర్తిగా ధ్వంసం కాగా, త్వరలోనే మరమ్మతులు చేపడుతామని వారు పేర్కొన్నారు.





## చంద్ర గ్రహణం వేళ నగరంలో ఆలయాల మూసివేత



**అక్షరటుడే, ఇందూరు:** సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో ఆదివారం ఉదయం జిల్లాలోని ఆలయాలను మూసివేశారు. జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వరాలయం, జెండా బాలాజీ ఆలయాన్ని పూజారులు మూసివేశారు. ఖిల్లా రామాలయం, అయ్యప్ప దేవాలయం, శంభుని గుడి, బోధన్ చక్రేశ్వరాలయం, ఆర్మూర్ సిద్దులగుట్ట, సారంగాపూర్ హనుమాన్, గోల్ హనుమాన్ తదితర ఆలయాలను ఉదయం పూజలు నిర్వహించిన అనంతరం మూసి వేశారు. తిరిగి సోమవారం సంప్రోక్షణ చేసిన అనంతరం నిత్య పూజలు చేయనున్నారు. రాత్రి 9 గంటల 30 నిమిషాలకు గ్రహణం ప్రారంభమవుతుందని వేద పండితులు తెలిపారు. సుమారు మూడు గంటల పాటు గ్రహణం పడుతుందని, సంపూర్ణ చంద్రగ్రహణం కనబడుతుందని పేర్కొన్నారు.

## క్రీడా పరికరాలు, దుస్తుల పంపిణీ




**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని కుకునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలు, దుస్తులు అందజేశారు. ఆదివారం బాల్కొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త ఏనుగు దయానందరెడ్డి సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. పాఠశాల హెచ్ఎం హరిచరణ్, ఉపాధ్యాయులు పతాని గంగాధర్, శ్రీధర్ రావు, వేల్పూర్ మాజీ వైస్ ఎంపీపీ బోజపల్లి సురేష్ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

## సంస్మరణ సభలో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే




**అక్షర టుడే, ఇందల్వాయి:** సిరికొండ మండలం రావుట్ల గ్రామంలో ప్రొఫెసర్ లింబాద్రి మాతృమూర్తి కీ.శే.లక్ష్మి సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 'అమ్మతో అనుబంధం' పుస్తకం ఆవిష్కరించారు. ముందుగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వాల్గోట్, కొండూరు వద్ద రూరల్ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.

## నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం



**అక్షరటుడే, కోటగిరి:** నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని ట్రాన్స్‌కో ఆపరేషన్స్ డీఈ ఎండీ ముక్తార్ పేర్కొన్నారు. విద్యుత్ సంస్థ అభివృద్ధిలో భాగంగా కొత్తపల్లి సబ్ స్టేషన్ కోటగిరి సెక్షన్, రుద్రూర్ సబ్ డివిజన్లలో నూతన వీసీబీలను ఆయన ప్రారంభించారు. గృహ వినియోగదారులకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించే క్రమంలో నూతన వీసీపీలను ప్రారంభించామన్నారు. రూ.3 లక్షలతో ఈ పరికరాలను అమర్చామని ఆయన తెలిపారు. కొత్తపల్లి గ్రామ వినియోగదారులకు, అగ్రికల్చర్ ఫీడర్‌కు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఉంటుందని ఆయన వివరించారు. ఏడీఈ రుద్రూర్ తోట రాజశేఖర్, కోటగిరి ఏఈ బుజ్జిబాబు, సిబ్బంది ప్రేమ్ దాస్, వెంకటేశం, రాజు గౌడ్, రవి వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.



## వధూవరులను ఆశీర్వదించిన పీసీసీ చీఫ్

ఇటీవల కాంగ్రెస్ నాయకుడు ఉప్ప సంతోష్ కుమారుడు రుద్రప్రసాద్‌కు ధనూశ్రీతో వివాహం జరిగింది. ఈ సందర్భంగా ఆదివారం పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్.. ఉప్ప సంతోష్ ఇంటికి స్వయంగా వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. – అక్షరటుడే, ఇందూరు

## సౌదీ అరేబియాలో బాన్సువాడ యువకుడికి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి ఈసాబిన్ అలీ కుమారుడు సాలంబిన్ ఈసా సౌదీఅరేబియాలోని ఖతర్ దేశంలో ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నాడు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుడిగా చేస్తున్న సేవలను గుర్తించిన ఇండియన్ కల్చర్ సెంటర్ అతడికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేసింది. విద్యారంగానికి అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందించారు. ఆయన ప్రతిభను అక్కడి భారతీయ సమాజం ప్రశంసించింది. ఈ సందర్భంగా సాలంబిన్ ఈసా మాట్లాడుతూ అవార్డుతో సన్మానించినందుకు సంతోషంగా ఉన్నానని, రాబోయే రోజుల్లో మన భారతదేశ ఖ్యాతిని మరింత పెంపొందించేలా కృషి చేస్తానన్నారు. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షుడు ఖాలేఖ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ మైనారిటీ కార్యదర్శి ఎండీ దావుద్ పలువురు అభినందనలు తెలియజేశారు.




## అక్రమంగా ఇసుక తవ్వుతున్న వ్యక్తులపై కేసు నమోదు

**అక్షరటుడే, భీమ్‌గల్:** భీమ్‌గల్ మండలం బెజ్జోర గ్రామ శివారులో కప్పలవాగులో ఇసుకను అక్రమంగా తవ్వుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. బెజ్జోరా శివారులోని కప్పలవాగు నుంచి ఇసుకను జేసీబీలతో ట్రాక్టర్లు నింపుతూ..తరలించే సమయంలో పోలీసులు దాడులు చేశారు. ట్రాక్టర్ యజమానులు ఈర్ల మహేందర్, మల్లెల స్వామి, దేశబోయిన రవికుమార్‌లపై కేసు నమోదు చేసి, జేసీబీతో పాటు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. మండలంలో అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్సై సందీప్ హెచ్చరించారు.

## పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలి

**అక్షరటుడే,ఇందూరు:** ఉద్యోగ ఉపాధ్యాయాలకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని 2003 ఉద్యోగ, ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. అర్గుల సత్యం, సురేందర్, స్వప్న, విజయ్ కుమార్, రామకృష్ణ, ప్రసాద్, గంగాధర్, విఠల్ , మోహన్, మురళి పాల్గొన్నారు.



## జీపీవోలకు నియామక పత్రాలు

**అక్షరటుడే, భీమ్‌గల్:** జీపీవోలకు ప్రభుత్వం నియామక పత్రాలు అందించినట్లు జీపీవోల సంఘం జిల్లా నాయకుడు సంగెం పృథ్వీరాజ్ తెలిపారు. తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని, నియామక పత్రాలు అందించడంపై సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జీపీవోలు గ్రామాల్లో రైతులకు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జీపీవో సంఘం నాయకులు సాయినాథ్, కొతల నవీన్, రాజేష్, సంతు, గంగాధర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు

**అక్షరటుడే, ఇందూరు:** ధర్పల్లి మండలంలోని గోవింద్‌పల్లి, నందిపేట్ మండలంలోని షాపూర్‌లో ఆయుష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆయుష్ విభాగం జిల్లా ఇన్‌చార్జి గంగాదాస్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగానే ఈనెల 9న గోవింద్‌పల్లిలో, 12న షాపూర్‌లో శిబిరాలు ఉంటాయని పేర్కొన్నారు. గ్రామస్థులందరికీ ఉచితంగా ఆరోగ్య పరీక్షలు, అలాగే విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, యోగా సాధనతో లాభాలు.. అనే అంశాలపై హైదరాబాద్ మెడికల్ కళాశాల విద్యార్థులు వివరిస్తారని చెప్పారు. క్యాంపు ఇన్‌ఛార్జి మమత, భువన, పారామెడికల్ సిబ్బంది, యోగా శిక్షకులు పాల్గొంటారని, వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌కు సన్మానం

**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండలం హెగ్డేలి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రెండేళ్లుగా మేనేజర్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న నరేష్‌ను గ్రామస్థులు సన్మానించారు. కొత్తగా వచ్చిన మేనేజర్ సుమన్ రెడ్డికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఉమా రాంబాబు, మాజీ ఉపసర్పంచ్ శివరాజ్ పటేల్, మాజీ సర్పంచ్, రవీందర్, సాయిలు, అర్జున్, రమేష్, మన్మథ స్వామి, మాధవరావు, మారుతి, శంకర్, పరమేష్, ఉమాకాంత్, గణేష్, కార్తీక్ పాల్గొన్నారు.



## పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో టీచర్స్ డే

**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని మార్కండేయ మందిరంలో పద్మశాలి సంఘ భవనంలో ఆదివారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది పద్మశాలి ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు మ్యాక మోహన్ దాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు మ్యాక హేమలత, కార్యదర్శి వసంత లక్ష్మి, కార్యదర్శి రమాకాంత్, కోశాధికారి బత్తుల భాస్కర్, కార్యక్రమ ప్రాజెక్ట్ ఛైర్మన్ బండి అనంత్ రావు, సర్వసమాజ్ ప్రతినిధి విద్యాసాగర్, ఉపాధ్యక్షుడు ఘనపురం సంతోష్, మోర్తాడ్ మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిలివేరీ రవి, 8 తర్పల అధ్యక్షులు బండి అనంత రావు, చిట్ల యగ్నేష్, రుద్ర రాజేశ్వర్,వేముల ప్రకాష్, సదామస్తుల గణపతి, బండి రాజు తదితరులు పాల్గొన్నారు.